## ఇన్‌స్టా ముసుగులో వలపువల

- ఎన్నారైని బ్లాక్‌మెయిల్ చేసి నిశ్చితార్థం
- భారీగా డబ్బు వసూలుకు ప్లాన్
- బాధితుడి ఫిర్యాదుతో యువతి అరెస్టు
- విశాఖపట్నంలో వెలుగుచూసిన ఘటన

హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ) : ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయాలతో యువకులను ముగ్గులోకి దింపి వారి నుంచి డబ్బులు గుంజుతూ మోసాలకు పాల్పడుతున్న యువతిని ఏపీ పోలీసులు అరెస్టుచేశారు. భీమిలి సీఐ సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖపట్నంలోని మురళీనగర్‌కు చెందిన కొరుప్రోలు జోయ్ జమీనా అమెరికాలో ఉంటున్న ఎన్ఆర్ఐ మనోహర్‌తో ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం పెంచుకున్నది. వైజాగ్‌లో నివాసముంటున్న ఆ యువకుడి తల్లిదండ్రుల వద్దకు వెళ్లి మనోహర్ స్నేహితురాలిని అంటూ పరిచయం చేసుకున్నది. కొన్ని రోజుల పాటు వారితో మంచిగా నటిస్తూ మీ అబ్బాయిని పెళ్లి చేసుకుంటానని చెప్పగా వారు నిరాకరించారు. దీంతో ఆమె అమెరికా నుంచి యువకుడిని రప్పించి ఎయిర్‌పోర్ట్ నుంచి నేరుగా మురళీనగర్ ఎన్జీవో కాలనీలోని తన ఇంటికి తీసుకెళ్లింది. మత్తు పానీయం ఇచ్చి ఇరువురు సన్నిహితంగా ఉంటున్నట్టు ఫొటోలు తీసింది. వాటితో తనను పెళ్లి చేసుకోవాలని బ్లాక్‌మెయిల్ చేసింది. భీమిలిలోని ఓ రెస్టారెంట్‌లో రూ.5 లక్షలు ఖర్చు చేయించి తన స్నేహితుల సమక్షంలో బలవంతంగా నిశ్చితార్థం చేయించుకున్నది. అనంతరం పెళ్లి చేసుకోకపోతే అభ్యంతరకర ఫొటోలను బహిర్గతం చేస్తానని బెదిరిస్తూ వేధింపులకు గురిచేసింది. ఎన్నారై మనోహర్‌ను రోజుల తరబడి ఇంట్లో బంధించింది. ఎట్టకేలకు ఆమె నుంచి తప్పించుకున్న బాధితుడు.. ఈ నెల 4న భీమిలి పోలీస్‌స్టేషన్‌లో యువతిపై ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన పోలీసులు నిందితురాలి నుంచి ల్యాప్‌టాప్, మూడు సెల్‌ఫోన్లు, కారును స్వాధీనం చేసుకున్నారు. గతంలోనూ ఇదే తరహాలో పలువురిని మోసగించి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసినట్లు నిర్ధారించి నిందితురాలిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.






కనుల పండువగా గంగానీళ్ల జాతర

సారంగాపూర్/దిలావర్‌పూర్, అక్టోబర్ 6 : నిర్మల్ జిల్లా సారంగాపూర్, దిలావర్‌పూర్ మండలాల్లో గంగానీళ్ల జాతర అంగరంగా వైభవంగా ముగిసింది. ఆదివారం భక్తులు వేకువజామునే ఆలయానికి చేరుకున్నారు. పవిత్ర కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించి క్యూలో నిలబడి మొక్కులు తీర్చుకున్నారు. గంగానీళ్ల జాతరను పురస్కరించుకొని నిర్మల్, నిజామాబాద్, కరీంనగర్, హైదరాబాద్ జిల్లాలతోపాటు మహారాష్ట్రలోని నాగపూర్, నాందేడ్, ఇస్లాపూర్, హిమాయత్‌నగర్ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి పోచమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకున్నారు.

## డొక్కు బస్సుల స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులు

హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ఆర్టీసీలో డొక్కు బస్సుల స్థానంలో కొత్తగా ఎలక్ట్రిక్ బస్సులను తెచ్చేందుకు సంస్థ ప్లాన్ చేస్తున్నది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైనప్పటి నుంచి గత పదేండ్లలో ఏకంగా 6,680 డొక్కు బస్సులను ఆర్టీసీ తుక్కు కింద వేలం వేసి అమ్మేయగా, వాటిస్థానంలో 4,226 బస్సులను కొనుగోలు చేసింది. ప్రస్తుతం వెంటనే తుక్కుగా మార్చాల్సిన 1,213 డొక్కు బస్సుల స్థానంలో కొత్తవాటిని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వానికి ఇటీవలే ఆర్టీసీ నివేదిక పంపింది. పీఎం ఈ డ్రైవ్ పథకంలో హైదరాబాద్ నగరానికి ఎలక్ట్రిక్ బస్సులు ఇవ్వాలని సంస్థ ఇప్పటికే దరఖాస్తు చేసుకొన్నది. నగరం అవసరాల కోసమే రాష్ట్ర ప్రభుత్వం మరో 2,300 ఎలక్ట్రిక్ బస్సులను అద్దెకు తీసుకునే చాన్స్ ఉన్నట్టు తెలుస్తున్నది. ఒక్కో బస్సు ధర రూ.1.85 కోట్లు ఉండడంతో అద్దెకు తీసుకోవాలని యోచిస్తున్నది.


నోటీసు చూపిస్తున్న చంద్రనాయక్


Accused
To A2 chandra Naik s/o Valiya naik age 39 lambada r/o H no 7-15/1 yerugonda Mahabubnagar
Whereas your attendance is necessary answer to Charge of U/s 147. 341. 136 r/w 149 IPC you are hereby directed to appear in person or by pleader before the Third JFCM Court on the day 19-11-2024 10-30 a.m.
Dated this 03 day 09 2024
Mahabubnagar
Addl. Judicial Magistrate of First Class

కోర్టు నుంచి వచ్చిన నోటీసు

## తెలంగాణ ఉద్యమకారులకు కోర్టు నోటీసులు

- సకలజనుల సమ్మెలో ఆర్టీసీ బస్సు ఆపినందుకు..
- అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులు
- నవంబర్ 19న హాజరుకావాలని 28 మందికి సమన్లు

మహబూబ్‌నగర్, అక్టోబర్ 6: ప్రత్యేక రాష్ట్రం కోసం 2011లో సకల జనుల సమ్మె సమయంలో అప్పటి తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు ఆర్టీసీ బస్సులను ఆపారు. అందుకుగానూ.. నాటి కాంగ్రెస్ ప్రభుత్వం మహబూబ్‌నగర్ ఉద్యోగ సంఘం నాయకులపై అక్రమ కేసులను బనాయించింది. తాజాగా మళ్లీ పాత కేసులను బయటకు తీసి వారికి నోటీసులు పంపడం బాధాకరం. 28 మంది తెలంగాణ ఉద్యమకారులకు నోటీసులు పంపి.. నవంబర్ 19న కోర్టుకు హాజరు కావాలని పేర్కొన్నది. మహబూబ్‌నగర్ జిల్లాలో ఉద్యమాన్ని తమ భుజస్కంధాలపై మోస్తూ సబ్బండ వర్గాలను ఏకం చేసిన ఉద్యోగ సంఘం నాయకులకు తాజాగా నోటీసులు రావడంతో ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. నోటీసులందుకున్న 28 మందిలో 15 మంది ఇప్పుడు ఉద్యోగ విరమణ పొందారు. వారి వయస్సు 70 ఏండ్ల పైబడింది. నలుగురు మహిళా ఉద్యోగులు ఉన్నారు. ఇప్పటికైనా ఆ కేసును రద్దు చేసేలా చర్యలు తీసుకోవాలని ఉద్యమ నాయకులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

**కూష్మాండ మాతగా ఏడుపాయల దుర్గమ్మ**


మెదక్ జిల్లా ఏడుపాయల వనదుర్గమ్మ ఆలయంలో దేవీ శరన్నవరాత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం దుర్గమ్మ కూశ్మాండ మాత అలంకరణతో దర్శనమిచ్చారు. – పాపన్నపేట

**మహాలక్ష్మి అలంకరణలో..**


మహబూబ్‌నగర్‌లోని వాసవి కన్యకాపరమేశ్వరీ ఆలయంలో అమ్మవారు మహాలక్ష్మి అలంకరణలో దర్శనమిచ్చారు. అమ్మవారిని రూ.6,66,66,666తో అలంకరించారు. – పాలమూరు

**లలితా త్రిపురసుందరీ దేవిగా కనకదుర్గమ్మ**


విజయవాడ కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారు లలితా త్రిపురసుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులతో ఇంద్రకీలాద్రి కిక్కిరిసిపోయింది. – హైదరాబాద్, నమస్తే తెలంగాణ

**ముత్యపు పందిరి వాహనంపై శ్రీవారు**


శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం మలయప్పస్వామి ముత్యపు పందిరి వాహనంపై స్వామి వారు ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. – హైదరాబాద్, నమస్తే తెలంగాణ

## సింగూరు రెండు గేట్లు ఎత్తివేత

పుల్కల్, అక్టోబర్ 6: సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలంలోని సింగూరు ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. ఆదివారం 6, 11వ నంబర్ గేట్లు 1.50 మీటర్ల మేర ఎత్తి 11,026 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. విద్యుత్తు ఉత్పత్తి కోసం జెన్కోకు 2,796 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఆదివారం 13,076 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో, 14,453 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో కొనసాగినట్టు ప్రాజెక్టు ఏఈ మహిపాల్‌రెడ్డి తెలిపారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 29.917 టీఎంసీలు కాగా, 29.708 టీఎంసీలు నీరు ఉన్నట్టు అధికారులు వెల్లడించారు.

## ఈబీసీలపై కాంగ్రెస్ వైఖరేంటి?: రవీందర్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ) : ఈబీసీలపై కాంగ్రెస్ పార్టీ వైఖరేమిటో స్పష్టం చేయాలని, ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి స్పందించాలని ఈబీసీల సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు వీ రవీందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈబీసీల జోలికొస్తే దేశ వ్యాప్తంగా ఉద్యమిస్తామని కాంగ్రెస్ పార్టీని హెచ్చరించారు.

**గోమాతకు పుట్టిన రోజు వేడుకలు**

జగిత్యాలజిల్లా బీర్‌పూర్‌లో ఓ రైతు కుటుంబం లేగ దూడకు పుట్టినరోజు వేడుకలు నిర్వహించింది. బైరవేని సత్యనారాయణ– భాగ్యలక్ష్మి దంపతులు పెంచుకుంటున్న ఆవుకు పుట్టిన లేగదూడకు ఆదివారంతో సంవత్సరం నిండింది. ఈ క్రమంలో వేద పండితుడి ఆధ్వర్యంలో గోమాతకు పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. కేట్ కట్ చేసి.. స్థానికులకు స్వీట్లు పంపిణీ చేశారు. – సారంగాపూర్




విజేత జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న డీఎస్పీ రఘుచందర్

## క్రీడలతో మానసిక ఆనందం

- జగిత్యాల డీఎస్పీ రఘుచందర్
- క్రికెట్ టోర్నీ విజేతలకు ట్రోఫీలు, నగదు పురస్కారం ప్రదానం

మల్యాల, అక్టోబర్ 6: క్రీడలతో మానసిక ఆనందం కలిగి, శారీరక దృఢత్వం పెరుగుతుందని, యువత క్రీడల్లో రాణించాలని జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ సూచించారు. మల్యాల మండల కేంద్రంలో నిర్వహించిన ఎంఎస్ వారియర్స్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగియగా, బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి హాజరై, విజేత డీఎస్ఎమ్–03 జట్టుకు ట్రోఫీతోపాటు రూ.20 వేల నగదు పురస్కారం, రన్నరప్‌గా నిలిచిన వన్‌హాస్పిటల్ టీంకు రూ.10 వేల నగదు బహుమతితోపాటు ట్రోఫీని అందజేశారు. అలాగే మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా ఎంపికైన శేఖర్‌కు రూ.5వేల నగదు ప్రోత్సాహం అందించారు. కార్యక్రమంలో సీఐ నీలం రవి, ఎస్ఐ నరేష్‌కుమార్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఫ్రాంచైజీల యజమానులు, ఆరు జట్ల క్రీడాకారులు పాల్గొన్నారు.

# సహకార సంఘాలు.. రైతు అభివృద్ధి కేంద్రాలు

- రూ.2లక్షల లోపు రుణాలన్నీ మాఫీ చేస్తాం
- ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం
- రైతు సంక్షేమానికి కృషిచేస్తాం
- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి
- పోతారం సహకార సంఘ నూతన కార్యాలయ భవనం ప్రారంభం


పోతారం సహకార సంఘ కార్యాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

మల్యాల, అక్టోబర్ 6: ఒకప్పుడు అప్పులు మాత్రమే ఇచ్చే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, కాలక్రమేనా రైతు అభివృద్ధి కేంద్రాలుగా మారాయని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. ఆదివారం పోతారం గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ కార్యాలయ నూతన భవనాన్ని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డితో కలిసి ప్రారంభించి, మాట్లాడారు. పోతారం సహకార సంఘం సమర్థవంతమైన సేవలు అందిస్తున్నదని చెప్పారు. భవిష్యత్‌లో సంఘ అభివృద్ధికి అవసరమైన సహాయసహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. రూ.2 లక్షల లోపు రుణాలు పొందిన రైతులందరికీ మాఫీ చేస్తామన్న ఆయన, సాంకేతిక సమస్యలతో కొంతమందికి రాలేదని చెప్పారు. అనంతరం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ రుణమాఫీ విషయంలో అపోహలు వద్దని, దేశంలో రుణమాఫీకి కట్టుబడి ఉన్న పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని స్పష్టం చేశారు. వరిలో దొడ్డు రకంతో పోల్చితే సన్న రకం కొంత దిగుబడి తక్కువ వస్తుందనే ఉద్దేశంతోనే ప్రభుత్వం మద్దతు ధరపై క్వింటాల్‌కు రూ.500 బోనస్‌ను ప్రకటించిందని చెప్పారు. తనకు మల్యాల ప్రాంతంతో 43 ఏండ్లు అనుబంధం ఉందని, 1981లో తాను మల్యాల మండల సమితి అధ్యక్షుడిగా పోటీ చేసి గెలుపొందినట్లు గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో సహకార సంఘం అధ్యక్షుడు అయిల్నేని సాగర్‌రావు, ఉపాధ్యక్షుడు కిషన్‌రెడ్డి, నాయకులు ముత్యాల రాంలింగారెడ్డి, కొండపలుకుల రాంమోహన్‌రావు, బోయినపల్లి మధుసుదన్‌రావు, బత్తిని శ్రీనివాస్‌గౌడ్, మహిపాల్‌రెడ్డి, దొంగ ఆనందరెడ్డి, దారం ఆదిరెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, సత్యంరావు, వేణురావు, సీఈవో కమటవ గంగాధర్, పాలకమండలి సభ్యులు మల్‌హల్‌రావు, రాసమల్ల గంగవ్వ, నిమ్మ గణేష్, శంకర్, గడ్డం రాధ, నల్ల తిరుపతిరెడ్డి, దాసరి మల్లయ్య, భైరి మల్లేశం, సహకార సంఘ పరిధిలోని రాంపూర్, రాజారాం, గొల్లపల్లె, పోతారం రైతులు పాల్గొన్నారు.

## ఒంటి కాలిపై నిల్చోని నిరసన

మల్లాపూర్, అక్టోబర్ 6: సిరిపూర్ సహకార సంఘం సమస్యలను పరిష్కరించాలని పాలకవర్గ సభ్యులు డిమాండ్ చేశారు. సహకార సంఘం అధ్యక్షుడు బద్దం అంజిరెడ్డి ఆధ్వర్యంలో చేస్తున్న రిలే నిరాహార దీక్ష ఆదివారం రెండో రోజుకు చేరగా, పాలకవర్గ సభ్యులు శిబిరం వద్ద ఒంటికాలిపై నిల్చోని నిరసన తెలిపారు. రాత్రి శిబిరం వద్దే పడుకొని తమ ఆవేదనను వెలిబుచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సంఘానికి అటాచ్‌గా ఉన్న అమ్మక్కపేట గ్రామంలో ఉన్న 3.11 ఎకరాల భూమి, గతంలో అక్రమాలకు పాల్పడిన పాత సీఈఓకు చెందిన వేంపేట గ్రామంలోని 1.20 ఎకరాల భూమిని ప్రభుత్వ నిబంధనల ప్రకారమే వేలం వేశామని, ఏడాది గడుస్తున్నా కొనుగోలు చేసిన వ్యక్తికి రిజిస్ట్రేషన్ చేయడం లేదని వాపోయారు. సమస్యను పరిష్కరించాలని ఉన్నతాధికారులకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేదని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని కోరారు. తాము దీక్ష చేస్తున్న సమయంలో డీసీఓ తమపై కక్ష్య పూరితంగా వ్యవహరించి సర్ చార్జీలు చెల్లించాలని నోటీసులు అందించారని ఆరోపించారు. ఇక్కడ వైస్‌చైర్మన్ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.


దీక్షా శిబిరం వద్ద ఒంటి కాలిపై నిలబడి నిరసన వ్యక్తం చేస్తున్న సహకార సంఘం పాలకవర్గ సభ్యులు

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

మల్లాపూర్, అక్టోబర్ 6: రాష్ట్ర వ్యాప్తంగా బీసీల కుల గణన నిర్వహించి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని జిల్లా బీసీ సంఘాల జేఏసీ చైర్మన్ పుప్పాల లింబాద్రి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని కేఎంఆర్ గార్డెన్‌లో నిర్వహించిన బీసీ సంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో బీసీ సంఘాల బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. బీసీలకు రిజర్వేషన్లను ప్రకటించాలని డిమాండ్ చేస్తూ 9న పార్టీలకతీతంగా మెట్‌పల్లి పట్టణంలో సత్యాగ్రహ దీక్షను నిర్వహిస్తున్నామని, జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో బీసీ సంఘాల నాయకులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఇక్కడ నాయకులు బోయిని హన్మాండ్లు, కోరుట్ల రాములు, మహ్మద్ రఫీ, సిరిపురం రవీందర్, చిట్యాల లక్ష్మణ్, ముద్దం సత్యనారాయణగౌడ్, మొరపు గంగరాజం, నల్ల రాజేందర్, పెరుమాండ్ల రాజేందర్, గజ్జి గంగారెడ్డి, బొక్కల నాగరాజు, సారుగు దేవయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న హరి అశోక్ కుమార్

## రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించాలి

టీ పెన్షనర్స్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్

జగిత్యాల, అక్టోబర్ 6: ఏడు నెలలు కావస్తున్నా రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందక విరమణ ఉద్యోగులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తెలంగాణ పెన్షనర్స్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో అసోసియేషన్ కార్యాలయంలో పలువురు విరమణ ఉద్యోగులు ఆయన్ను కలిసి తమ సమస్యలు చెప్పుకోగా, ఈ సందర్భంగా అశోక్ కుమార్ మాట్లాడారు. ప్రభుత్వం సత్వరమే విరమణ ఉద్యోగులకు ప్రయోజనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ఉద్యోగులకు, పెన్షనర్స్‌కు బకాయి ఉన్న నాలుగు డీఏలు, పీఆర్‌సీ ఫిట్మెంట్ అందించాని, నగదు రహిత వైద్యసేవలు కల్పించాలని, కమ్యూటేషన్ రిస్టోరేషన్ రికవరీ పీరియడ్ 15 ఏండ్ల నుంచి 12 ఏండ్లకు తగ్గించాలని ఇటీవల డిప్యూటీ సీఎం, సీఎస్ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ఇక్కడ జిల్లా ప్రధాన కార్యదర్శి బొల్లం విజయ్, సహాయ అధ్యక్షుడు పీ హన్మంత్ రెడ్డి, కోశాధికారి గౌరిశెట్టి విశ్వనాథం, ఉపాధ్యక్షులు వెల్ముల ప్రకాశ్ రావు, ఎండీ యాకూబ్, దిండిగాల విఠల్, సత్యనారాయణ, దేవేందర్ రావు, నారాయణ ఉన్నారు.

## బాకీ డబ్బుల కోసం గొడవ

శంకరపట్నం, అక్టోబర్ 6: మొలంగూర్‌కు చెందిన కొలిపాక సమ్మయ్య, కల్లూరి శ్రీనివాస్ ఇద్దరు స్నేహితులు. సమ్మయ్య కల్లూరి శ్రీనివాస్‌కు పీర్‌లెస్ స్కీమ్‌కు సంబంధించిన డబ్బులు బాకీపడ్డాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 4న బాకీ డబ్బుల విషయమై ఇద్దరి మధ్య గొడవ జరిగింది. సమ్మయ్య బైక్‌పై వస్తుండగా, అతడిని శ్రీనివాస్ నెట్టి వేశాడు. దీంతో కిందపడిన సమ్మయ్యకు గాయాలయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు హన్మకొండలోని ఓ దవాఖానకు తరలించగా అక్కడ చికిత్సపొందుతూ కోమాలోకి వెళ్లాడు. అతడి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## గుండె జబ్బును గుర్తించడంలో ఈసీజీ కీలకం

- మెడికవర్ గుండె వైద్య నిపుణుడు డాక్టర్ అనీష్ పబ్బ

విద్యానగర్, అక్టోబర్ 6: ప్రాథమికంగా గుండె జబ్బును గుర్తించడంలో ఈసీజీ కీలక పాత్ర పోషిస్తుందని మెడికవర్ గుండె వైద్య నిపుణుడు డాక్టర్ అనీష్ పబ్బ పేర్కొన్నారు. ఆదివారం కరీంనగర్‌లోని హోటల్ ప్రతిమలో ఎంబీబీఎస్ వైద్యులకు ఈసీజీపై మెలకువలు నేర్పించారు. గుండె పనితీరును ఈసీజీ ద్వారానే నిర్ధారించడం జరుగుతుందని తెలిపారు. అధునాతన పరికరాలు అందుబాటులోకి వచ్చినా ఈసీజీకి మాత్రం ప్రాముఖ్యత తగ్గలేదన్నారు. ఇక్కడ మెడికవర్ దవాఖాన సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, మార్కెటింగ్ హెడ్ కోట కరుణాకర్, మార్కెటింగ్ సిబ్బంది ఉన్నారు.

## మైనార్టీలు అప్రమత్తంగా ఉండాలి

- ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్
- కోరుట్లలో మైనార్టీ హక్కుల సాధనపై సదస్సు

కోరుట్ల, అక్టోబర్ 6: ముస్లింలు, హిందువుల మధ్య విద్వేషాలు రగిల్చేందుకే కేంద్రం వక్ఫ్ బోర్డు బిల్లు తీసుకువచ్చిందని, బీజేపీ విధానాలపై మైనార్టీలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్సీ అమీర్ అలీ ఖాన్ సూచించారు. పట్టణంలోని సీఎమ్మార్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం యునైటెడ్ ముస్లిం, మైనార్టీ రైట్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జరిగిన మైనార్టీ హక్కుల సాధన అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. మైనార్టీలకు రాజ్యాంగబద్ధంగా సంక్రమించిన హక్కులను ప్రభుత్వాలు పకడ్బందీగా అమలు చేయాలని పిలుపునిచ్చారు. ఉర్దూ భాష అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, మైనార్టీ నాయకులు తాజుద్దీన్, రియాజ్, అజ్మాతుల్లా హుస్సెన్, మజార్ ఖాస్మీ, ఇలియాస్ ఖాన్, సలీం పారుఖీ పాల్గొన్నారు.

## 'మహాధర్నా'ను విజయవంతం చేయండి

జగిత్యాల, అక్టోబర్ 6: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారానికి తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా కన్వీనర్ పుప్పాల శ్రీకాంత్ పిలుపునిచ్చారు. ఆదివారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోమటి చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో యూనియన్ జిల్లా కార్యదర్శి పులి మల్లేశ్, వెంకట చారి, రాజేశం, శాతల్ల రాజేందర్, గర్వందుల రమేశ్ పాల్గొన్నారు.

## లాటరీ నిర్వాహకులపై కేసు

ధర్మపురి, అక్టోబర్ 6: ధర్మపురి పట్టణంలో లాటరీ దందా నిర్వహిస్తున్న ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహేశ్ తెలిపారు. దసరా సందర్భంగా లాటరీ నిర్వహిస్తున్నామని, మొదటి బహుమతిగా గొర్రె పోతు, రెండో బహుమతిగా మేక పోతు, ఆ తర్వాత స్థానాల వారు మద్యం సీసాలు గెలువవచ్చని, కొంత నగదు చెల్లించి రశీదు పొందితే ఇందులో పాల్గొనవచ్చని ప్రజలను ఆకర్షిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు విచారణ జరిపి ఆరుగురు నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.